సాక్షి ప్రకాశం

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



విద్యార్థిని ఆత్మహత్యపై అనుమానాలెన్నో..?

ఒంగోలులో హర్షిణి జూనియర్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. - 8లో..



మెడికల్ కాలేజీలో కౌన్సెలింగ్ ప్రారంభం

ఒంగోలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. - 8లో..

గరిష్టం/కనిష్టం 38.1/29

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

- కలెక్టరు తమీమ్ అన్సారియా



ఆస్పత్రుల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రత అత్యధిక ప్రాధాన్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లాలోని వివిధ కేటగిరీల ప్రభుత్వ ఆస్పత్రుల ఉన్నతాధికారులతో మంగళ వారం ప్రకాశం భవనంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ఆస్పత్రుల వారీగా ఉన్న సిబ్బంది, విధుల కేటాయింపు, పారిశుద్ధ్యం, భద్రత, వివిధ పనుల్లో పురోగతి, హెచ్‌డీఎస్ నిధుల లభ్యత, ఎన్‌టీఆర్ వైద్య సేవలు లభిస్తున్న తీరు, ఎంప్యానల్‌మెంట్ సమస్యలు, మెడిసిన్స్-సర్జికల్స్ లభ్యత వంటి తదితర అంశాలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎం.హెచ్.ఓ సురేష్‌కుమార్, డి.సి.హెచ్.ఎస్. శేషకుమార్, రిమ్స్ సూపరింటెండెంట్ దుర్గాదేవి, ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ హేమంత్, డి.ఐ.ఓ పద్మజ, ఆర్.బి.ఎస్.కె. కో ఆర్డినేటర్ భగీరథి, డి.పి.ఎం.ఓ. వాణిశ్రీ, కమ్యూనిటీ ఏరియా, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ఏ.పి.ఎం.ఎస్, ఐ.డి.సి. అధికారులు పాల్గొన్నారు.

ఫైనల్ ఇయర్ మెడికల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఒంగోలు టౌన్: చివరి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న ఇ.దిలీప్ కుమార్ ఆత్మహత్యాత్నం చేశాడు. సకాలంలో తలిదండ్రులు అప్రమత్తం కావడంతో వెంటనే అతడిని వైద్య చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. తాడేపల్లికి చెందిన ఇ.దిలీప్ కుమార్ ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో హాస్టల్ గదిలో కూర్చొని ఎలుకల మందు తిన్నాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని, అమ్మా..నువ్వు జాగ్రత్త అంటూ మెసేజ్ పెట్టడంతో వెంటనే అప్రమత్తమైన అతడి తల్లిదండ్రులు దిలీప్ మిత్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న కళాశాల సిబ్బంది, మిత్రులు కలిసి గది తలుపులు పగులగొట్టి దిలీప్‌ను జీజీహెచ్‌కు తరలించారు. అత్యవసర చికిత్స చేసి కడుపులో ఉన్న మందును కక్కించి అబ్జర్వేషన్‌లో ఉంచారు. ప్రస్తుతానికి దిలీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. 48 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగానే ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు జీజీహెచ్‌కు చేరుకొని వివరాలు సేకరించారు.

గ్రామ స్థాయిలోకి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న, కలెక్టర్ తమీమ్ అన్సారియా, కమిషనర్ వెంకటేశ్వర రావు

ఒంగోలు సబర్బన్: దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలను పురస్కరించుకొని ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ప్రకాశం భవన్ వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వర రావు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు పాల్గొన్నారు.



రైస్ మాఫియా..

తమ్ముళ్ల రగడ

అధికార తెలుగుదేశం పార్టీ నేతల కనుసన్నల్లో రైస్ మాఫియా జోరుగా సాగుతోంది. అధికారంలోకి రాగానే రేషన్ బియ్యాన్ని 'సంపద సృష్టి'గా ఎంచుకున్నారు. జిల్లా ముఖ్యనేత అండతో.. స్థానిక ముఖ్య నేతలకు నజరానాలు చెల్లించి.. జేబులు నింపుకుంటున్నారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి మండలంలో రేషన్ డీలర్లలో కొందర్ని, రేషన్ వ్యాపారంలో ఆరి తేరిన తెలుగు తమ్ముళ్లను మరి కొందర్ని కమీషన్ ఏజెంట్లుగా పెట్టుకుని మరీ అక్రమ దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిస్తున్నారు. ఈ చీకటి దందాలో అధికార పార్టీలోని రెండు వర్గాల మధ్య అంతర్గతంగా వార్ సాగుతోంది. ఒంగోలు, కనిగిరి నేతల మధ్య తీవ్రస్థాయిలో రగడ జరుగుతోంది.

- జోరుగా రేషన్ అక్రమ వ్యాపారం
- ఒకరి బియ్యాన్ని మరొకరు పట్టించుకుంటున్న వైనం
- నెలకు రూ.అరకోటికి పైగా చౌక బేరం
- కనిగిరి, ఒంగోలు నేతల మధ్య వార్
- లీడర్లు, రేషన్ డీలర్లు కమీషన్ ఏజెంట్లుగా..

కనిగిరి రూరల్: రేషన్ బియ్యం అక్రమ రవాణాను తెలుగు తమ్ముళ్లకు ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. ఈ దందాలో అధికార పార్టీ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంటోంది. జిల్లా అంతటా హోల్ సేల్‌గా మాట్లాడుకున్న ఒంగోలు ముఠాకు, అప్పటికే అక్రమ వ్యాపారం చేస్తున్న ముఠాలు అడ్డుపడుతున్నాయి. ఒంగోలు ముఠా కనిగిరి పట్టణానికి చెందిన ఇద్దరు సీనియర్ డీలర్లను అడ్డం పెట్టుకుని కమీషన్లు ఇస్తూ నియోజకవర్గంలోని అందరు డీలర్లను బెదిరించింది. డీలర్ల వద్ద ఉన్న రేషన్ బియ్యాన్ని ఇతరులకు వెళ్లనీయకుండా మూట కట్టించి ఒంగోలు ముఠాకు సరఫరా చేయిస్తున్నారు.

ముందు రోజు డీల్..

ముందుగా డీలర్లు కారులో కనిగిరి వెళ్లి ఏ డీలర్ దగ్గర ఎంత సరుకు ఉందనే దాన్ని ముఠా యజమానులకు లెక్క చెప్తారు. తదనుగుణంగా లారీలు వెళ్తాయి. అయితే పీసీపల్లి మండలానికి చెందిన రేషన్ డీలర్లు మాత్రం రేషన్ బియ్యాన్ని పాత ముఠా వ్యాపారికి ఇస్తున్నట్లు తెలిసింది. అంతేగాక ఒంగోలు ముఠా కిలో బియ్యానికి రూ.15 ఇస్తుండగా.. పాత ముఠా వ్యాపారి కిలో బియ్యానికి రూ.16 నుంచి రూ.17 వరకు ఇస్తున్నట్లు సమాచారం. కంభం, బేస్తవారిపేటకు చెందిన బియ్యం అక్రమ వ్యాపారులు.. హనుమంతునిపాడు మండలంలోని కొందరు డీలర్ల దగ్గర కిలో రూ.18 నుంచి రూ.19 వరకు నగదును చెల్లించి తీసుకెళ్తున్నట్లు తెలిసింది. దీంతో అక్రమ రేషన్ వ్యాపార జోరులో తీవ్ర పోటీ నెలకొంది.

ఒంగోలు.. కనిగిరి ముఠాల మధ్య వార్:

కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలానికి చెందిన పాత రేషన్ వ్యాపారికి ఒంగోలు నుంచి దిగుమతి అయిన కొత్త వ్యాపారులకు మధ్య పొసగడం లేదు. తాను పార్టీలో చేరి రూ.లక్షలు ఖర్చుపెట్టానని.. మండలంలో పార్టీకి తానెంతో ఉపయోగపడ్డానని.. రేషన్ చీకటి దందా వ్యాపారాన్ని కనిగిరిలో తానే సాగిస్తానని అడ్డం తిరిగినట్లు తెలిసింది. ముఖ్యనేత ఆశీస్సులు ఒంగోలు ముఠాకు ఉన్నా.. కనిగిరికి చెందిన పాత వ్యాపారి అడ్డం తిరగడంతో రగడ ప్రారంభమైంది. ఒంగోలుకు చెందిన రేషన్ ముఠాలోని కీలక వ్యక్తులు, కనిగిరికి చెందిన రేషన్ దందా చేసే పాత వ్యాపారి ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంలో ఒకరికి ఒకరు తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

నెలకు రూ.అరకోటికి పైగా వ్యాపారం..

కనిగిరి నియోజకవర్గం నుంచి ప్రతి నెలా అరకోటికి పైగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. రేషన్ డీలర్ల దగ్గర నుంచి వ్యాపారస్తులు కిలో రూ.15కు కొనుగోలు చేస్తున్నారు. వీటిని అక్రమ వ్యాపారులు కొందరు నేరుగా బడా వ్యాపారులకు రూ.70 నుంచి రూ.80 అమ్ముతుండగా.. మరి కొందరు కావలి, వినుకొండ తదితర ప్రాంతాల్లో రైస్ మిల్లర్లకు రూ.23కు విక్రయిస్తున్నట్లు సమాచారం. అన్ని శాఖల అధికారులకు, నేతలకు నజరానాలు.. కమీషన్ ఏజెంట్ల జీతాలు పోను అక్రమ వ్యాపార ముఠాకి నెలకు రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు మిగులుతుందని తెలిసింది. ప్రతి నెలా ఒక్క కనిగిరి మండలం నుంచే సుమారు 3 నుంచి 5 వేల బస్తాలు దాదాపు 10 లారీల్లో ఎగుమతి అవుతుండగా.. మిగతా ఐదు మండలాల నుంచి భారీ స్థాయిలో ఎగుమతి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మొన్న ఒంగోలు ముఠా బియ్యం.. నిన్న కనిగిరి పాత ముఠా వ్యాపారి బియ్యం పట్టివేత

రేషన్ అక్రమ వ్యాపారంలో ఎవరికి వారు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. మూడు రోజుల క్రితం పామూరు టు నెల్లూరు వయా కృష్ణపట్నం పోర్టుకు బయలుదేరిన బొలెరో వాహనంలోని సుమారు 4 టన్నుల 80 బస్తాల రేషన్ బియ్యాన్ని పామూరు పోలీసులు రాత్రి వేళ హైవేలో పట్టుకుని సీజ్ చేశారు. అయితే వాటిని ఇంకా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించాల్సి ఉంది. ఈ అక్రమ రేషన్ బియ్యం ఒంగోలుకు చెందిన ముఠావిగా తెలిసింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఒంగోలు ముఠా... శనివారం రాత్రి పీసీపల్లి మండలంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 112 బస్తాలు రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టించారు. ఈ అక్రమ రేషన్ బియ్యం కనిగిరికి చెందిన పాత వ్యాపారివిగా సమాచారం.

మూడు రూట్లలో తరలింపు..

రేషన్ మాఫియా కనిగిరి నుంచి పీడీఎస్ బియ్యాన్ని మూడు రూట్లలో ఇతర దేశాలకు తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో దాదాపు 85 శాతం డీలర్లను మార్చారు. ప్రస్తుతం ఉన్న డీలర్లంతా అధికార పార్టీ అనుయాయులే. దీంతో రేషన్ చీకటి దందా సులువుగా మారింది. కనిగిరి నుంచి కనిగిరి, పీసీపల్లి, వెలిగండ్ల మండలంలో సగం డీలర్ల అక్రమ బియ్యం పీసీపల్లి, కందుకూరు, మీదుగా కావలి మిల్లుకు లేదా... నేరుగా కృష్ణపట్నం పోర్టుకు వెళ్తాయి. పామూరు, సీఎస్‌పురం మండలాలకు చెందిన అక్రమ బియ్యం ఉదయగిరి, నెల్లూరు మీదుగా కృష్ణపట్నం పోర్టుకు చేరుతాయి. వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాలకు చెందిన రేషన్ అక్రమ బియ్యం.. వేములపాడు ఘాట్ రోడ్డు మీదుగా.. వినుకొండ అటు నుంచి కృష్ణపట్నం పోర్టుకు చేరుతాయి.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు



ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అందులో భాగంగా వైద్య విద్యను ప్రోత్సహించాలి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయాలని చూడడం, రాష్ట్ర వాటాగా వచ్చిన సీట్లను వద్దని వెనక్కి పంపించడం బాధాకరం. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.

– డి.కుసుమ, నీట్ విద్యార్థిని, గొట్టిగుండ్ల గ్రామం



వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే



మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేట్ పరం చేయడం నిరుపేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమే. ఇది మొత్తం రాష్ట్రానికి నష్టం కలగజేస్తుంది. బోధనాసుపత్రుల ద్వారా పేదలకు అందే వైద్యం కూడా అందకుండా పోతుంది. ప్రభుత్వం లాభనష్టాలను పరిగణలోకి తీసుకోకుండా సేవా దృక్పథంతో ఆలోచించాలి. ప్రభుత్వం స్వయంగానే మెడికల్ కళాశాలలను నిర్వహించాలి.

– చల్లా కోటిరెడ్డి, నీట్ విద్యార్థి, కొండపి

నిమజ్జనానికి.. స్వామి విఘ్నం

- మంత్రి స్వామి ఆదేశాలతో వినాయక నిమజ్జనాన్ని అడ్డుకున్న పోలీసులు
- మూడు రోజులుగా రోడ్డు పక్కనే వినాయక విగ్రహం
- చౌటపాలెంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు
- పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేసిన 16 మంది మహిళలపై కేసులు
- మంత్రి స్వామి తీరుపై మండిపడుతున్న ప్రజలు

పొన్నలూరు: పోలీసులు సాక్షిగా చౌటపాలెం గ్రామంలో మూడు రోజులుగా వినాయకుడి బొమ్మ నిమజ్జనానికి నోచుకోక రోడ్డుపక్కనే ఉండిపోయింది. మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి, స్థానిక టీడీపీ నాయకుల రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా మూడు రోజులైనా నిమజ్జనానికి నోచుకోని వినాయకుడి బొమ్మ ఎండలోనే ఉంది. దీంతో గ్రామస్తులు ఎండ తగలకుండా వినాయకుడి బొమ్మకు పరదా కప్పారు. తమ మాటే వేదమంటూ వినాయకుడి నిమజ్జనానికి అనుమతులు ఉన్నా కావాలనే మూడు రోజులుగా మంత్రి స్వామి, పోలీసులు అడ్డుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన మంత్రి స్వామి, పోలీసులు తమ విధులు మరిచిపోయి సున్నితమైన అంశంలో తలదూర్చి గ్రామ ప్రజల మధ్య వర్గాలను ప్రోత్సహిస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నారు. తమ మాటే చెల్లుబాటు కావాలనే మంత్రి స్వామి, టీడీపీ నాయకులు ప్రవర్తిస్తుంటే, వారి అనవసర ఆదేశాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తూ పోలీసులు పూర్తిగా తమ బాధ్యతలను మరిచిపోయారు. మూడు రోజులుగా పదుల సంఖ్యలో పోలీసులు చౌటపాలెంలో మకామేసి గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తూ ఉద్రిక్త పరిస్థితులు లేవనెత్తుతున్నారు.

ట్రాక్టర్లు, బైక్‌ల సీజ్..

గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆదివారం రాత్రి వినాయక నిమజ్జన, పూజా కార్యక్రమం ఉందని చౌటపాలెం గ్రామానికి వచ్చిన బంధువులను పోలీసులు అడ్డుకున్నారు. మీరెందుకొచ్చారని ప్రశ్నించి రెండు ట్రాక్టర్లు, 13 ద్విచక్ర వాహనాల తాళాలు తీసుకున్నారు. తాము బంధువుల పిలుపు మేరకు వచ్చామని కాదంటే వెనుకకు వెళ్లిపోతామని చెప్పినా పోలీసులు వినకుండా వారి వాహనాలను పక్కన పెట్టించారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన తమ వాహనాలను సీజ్ చేయడం సరికాదంటూ పలు గ్రామాల బంధువులు వాపోయారు.



రోడ్డుపక్కనే ఉన్న వినాయకుడి బొమ్మకు ఎండ తగలకుండా కప్పిన పరదా

గ్రామస్తులు, మహిళలపై కేసు నమోదు:

ఇదిఇలా ఉంటే ఆదివారం రాత్రి మంత్రి స్వామి చెప్పాడంటూ వినాయక నిమజ్జనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మంత్రి స్వామి, పోలీసుల తీరుకు నిరసనగా పొన్నలూరు పోలీస్‌స్టేషన్ ముందు ఓవీ రోడ్డుపై చౌటపాలెం గ్రామస్తులు, మహిళలు సుమారుగా 400 మంది ధర్నా చేసి నిరసన తెలిపారు. అయితే తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపిన గ్రామస్తులు, మహిళలపై మంత్రి స్వామి ఆదేశాల మేరకు 16 మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అందులో భాగంగానే మంగళవారం పోలీసులు గ్రామానికి చేరుకొని తెల్ల పేపర్‌పై సంతకాలు పెట్టాలని మహిళలను బెదిరించినట్లు తెలుస్తోంది. తాము చెప్పినట్లుగా మంగళవారం వినాయక బొమ్మను నిమజ్జనానికి తరలిస్తే గ్రామస్తులు, మహిళలు, బంధువులపై కేసులు పెట్టకుండా వదిలేస్తామని పోలీసులు బెదిరించారు. అయితే ఆదివారం నిమజ్జన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని, అనుమతులు ఉన్నా మంత్రి స్వామి చెప్పాడంటూ తమ వినాయక నిమజ్జనానికి అడ్డు తగలడం వినాయకుడిని, గ్రామస్తులను అవమానించినట్టేనని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇక మేము నిమజ్జనం చేయమని, కావాలంటే అడ్డుకున్న మంత్రి స్వామి, మీరే నిమజ్జనం చేయాలని గ్రామస్తులు, మహిళలు పోలీసులకు తెగేసి చెప్పారు. ఇప్పటికే పోలీసులపై ప్రజల్లో విశ్వాసం పోయిందని కావాలంటే నిమజ్జనం ఖర్చు కొంత ఏర్పాటు చేస్తాం వినాయక బొమ్మను నిమజ్జనానికి తరలించాలని పోలీసులు చెప్పినట్లు గ్రామస్తులు అంటున్నారు.

అధికారపార్టీ నేతలు సైతం విస్మయం:

చౌటపాలెం గ్రామంలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనేలా చేసిన మంత్రి స్వామి, పోలీసుల తీరుపై ప్రజలతో పాటు అధికార పార్టీ నాయకులు సైతం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ రోజు మనకు అవకాశం ఉందని ఇలా ప్రవర్తిస్తే అధికారం లేని రోజున మనం సైతం ఇబ్బందులు పడతామని అనుకుంటున్నారు. దేవుని విషయంలో రాజకీయాలు చేస్తూ కక్ష సాధింపు చర్యలకు దిగడం మంచి పద్ధతి కాదని పెదవి విరుస్తున్నారు. ఇలాంటి చర్యల వలన గ్రామాల్లో ప్రజల మధ్య విభేదాలు ఏర్పడి గొడవలు జరుగుతాయిని అంటున్నారు. వినాయక నిమజ్జనం వంటి సున్నితమైన విషయంలో మంత్రి స్వామి తలదూర్చడంతో పార్టీకి చెడ్డపేరు వస్తుందని అధికార పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. మొత్తంగా మంత్రి స్వామి, పోలీసుల తీరుతో చౌటపాలెం వినాయకుడి బొమ్మ నిమజ్జనానికి నోచుకోక రోడ్డు పక్కనే ఉండి పోయింది.

దర్శి ఎస్సైపై చర్యలు తీసుకోవాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

- టీడీపీ గూండాలా ప్రవర్తిస్తున్న దర్శి ఎస్సై మురళి
- ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలి
- నాపై దాడి చేయాలని చూస్తే అడ్డు వచ్చిన వారిపై కేసులు పెట్టారు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజం
- ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ హౌస్ అరెస్టు

దర్శి: పచ్చ చొక్క తొడుక్కున్న టీడీపీ గూండాలా మహిళలపై దాడులు చేస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి చావబాదుతున్న దర్శి ఎస్సై మురళిని వెంటనే సస్పెండ్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న సీఐ రామారావు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్సై, సీఐల ప్రవర్తనకు నిరసనగా మంగళవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతియుతంగా నిరసన కార్యక్రమానికి శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని తెల్లవారు జామునే హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నివాసంలోనే భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తల మధ్య ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ అంటే తనకు ఎంతో గౌరవం ఉందన్నారు. అయితే ఈ ఎస్సై ప్రవర్తిస్తున్న తీరు చూస్తే పోలీస్ వ్యవస్థకే మచ్చవస్తుందని చెప్పారు. ఒక ఎస్సైలా పని చేయకుండా పసుపు చొక్కా వేసుకున్న టీడీపీ నాయకుడిలా వ్యవహరిస్తున్న తీరును ఆయన ఎండగట్టారు. సుమారు 300 మంది పోలీసులతో అప్పటికప్పుడు 144 సెక్షన్ పెట్టి హౌస్ అరెస్టులు చేసి తమ నిరసన అడ్డుకున్నారని చెప్పారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కార్యకర్తలను స్టేషన్ నుంచి బయటకు వెళ్లమనడం ..మీ ప్రభుత్వం కాదు మీరెందుకు వచ్చారని చెబుతున్న ఎస్సై తీరు దారుణంగా ఉందన్నారు. ఈ ఎస్సై మండలంలోని చలివేంద్రం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలను ఒక రౌడీలా దాడి చేసి చావబాదారన్నారు. రాత్రి పూట మహిళా కానిస్టేబుల్ కూడా లేకుండా మహిళలను బూటు కాళ్లతో తన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టడం దారుణంగా ఉందన్నారు. బొట్లపాలెం గ్రామంలో తన వాహనం పై దాడికి ప్రయత్నించిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి పై తానే స్వయంగా ఫిర్యాదు చేశానన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తిపై కేసుపెట్టకుండా తనపై దాడి అడ్డుకున్న అంజిరెడ్డి అనే వ్యక్తి పై కేసు పెట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి చితకబాది నిర్బంధించి హింసకు గురి చేశారని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు కూడా అతన్ని చూపించకుండా ఇబ్బంది పెట్టారన్నారు. ఒక ఎమ్మెల్యే నేరుగా ఫిర్యాదు చేస్తే న్యాయం చేయని ఎస్సై ఉంటేనేమి ఊడితే నేమని అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా కొత్త రెడ్డి పాలెం గ్రామంలో చిన్న తగాదా జరిగితే తూర్పు చౌటపాలెం గ్రామంలో నుంచి 30 మంది నాయకులు వచ్చి ఎస్సై, పోలీసులు కళ్ల ముందే వైఎస్సార్ సీపీ వారిపై దాడి చేస్తే ఎస్సై దాడికి గురైన వారిపైనే రివర్స్‌లో కేసులు పెట్టారన్నారు. మహిళలు అనే సంస్కారం లేకుండా బూతులు మాట్లాడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తి ఎస్సైగా అనర్హుడని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పైగా మీరు పోలీస్ స్టేషన్‌కు ఎందుకు వచ్చారు...ఇప్పుడు మీప్రభుత్వం కాదు..టీడీపీ ప్రభుత్వం అంటూ వచ్చిన వారిని బెదిరించి పంపుతున్నారని మండి పడ్డారు. ఎప్పుడూ టీడీపీ ప్రభుత్వం ఉండదని.. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి అని అన్నారు. ఈ విషయాన్ని తమ నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు. అవసరం అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దర్శిలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ ఎస్సై, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై తమ వద్ద ఉన్న ఆధారాలు, వీడియో క్లిప్పింగ్‌లను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చూపిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులకు రక్షణ కల్పించాలని, మంచి ఎస్సైని దర్శికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పోలీస్ వ్యవస్థను గౌరవించి అల్లర్లు జరగకుండా ర్యాలీ నిలిపేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, తాళ్లూరు మండల కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, జెడ్పీటీసీలు తాతపూడి రత్నరాజు, నుసుంనాగిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలక మార్పులు

- నాడు ప్రత్యేక పోడియం.. నేడు సాధారణం

మార్కాపురం: బ్రిటీష్ కాలంనాటి నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కోర్టులుగా భావిస్తూ కోర్టుల్లో న్యాయమూర్తిగా ప్రత్యేక పోడియం ఉన్నట్లుగానే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ప్రత్యేక పోడియం ఏర్పాటు చేశారు. సుమారు వందేళ్ల నుంచి ఇదే సాంప్రదాయం కొనసాగుతోంది. ప్రధానంగా భూముల రిజిస్ట్రేషన్, ఆస్తుల రిజిస్ట్రేషన్, మ్యారేజీ రిజిస్ట్రేషన్లను చేసే అధికారం ఒక్క సబ్‌రిజిస్ట్రార్‌కు మాత్రమే ఉంది. అందుకే బ్రిటీష్‌వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ కోర్టుల్లో జడ్జిల మాదిరిగా సబ్ రిజిస్ట్రార్‌కు ప్రత్యేక పోడియాన్ని ఏర్పాటు చేశారు. కోర్టుల్లో ఒక పిటిషన్‌పై విచారణ చేసినప్పుడు న్యాయమూర్తి పోడియం లోపల కుర్చీపై కూర్చుని విచారణ చేసినట్లుగా సబ్ రిజిస్ట్రార్ కూడా రిజిస్టర్ చేసే సమయంలో తాను పోడియంలోని కుర్చీలో కూర్చుని కొనుగోలుదారులను.. అమ్మకందారులను.. మీ ఇష్ట ప్రకారమే అమ్ముతున్నారా..? లేదా.. ప్రలోభాలకు లొంగి భయపడి అమ్ముతున్నారా..? అంటూ ప్రశ్నిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పోస్టు విలువలు టీడీపీ ప్రభుత్వం తగ్గించింది.

దీంతో మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా మార్పులు చేశారు. మంగళవారం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియంలను తీసి వేసి సబ్‌రిజిస్ట్రార్‌లకు సాధారణ కుర్చీలే వేశారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు పాత వైభవాన్ని గుర్తుతెచ్చుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిన్న పోడియంలో సబ్‌రిజిస్ట్రార్ కుర్చీ అలా..



నేడు సబ్‌రిజిస్ట్రార్ కుర్చీ ఇలా..

క్లుప్తంగా

బాలునిపై పోక్సో కేసు నమోదు

పామూరు: పామూరుకు చెందిన ఒక బాలుడిని మరో బాలుడు లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. ఈ ఘటనలో లైంగిక వేధిపులకు పాల్పడ్డ బాలునిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎంవీ రాజేష్ తెలిపారు. బాధిత బాలుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

భవనం నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు యర్రం రెడ్డి చెన్నారెడ్డి

కనిగిరి రూరల్: పట్టణంలోని వెన్నెల అపార్ట్‌మెంట్ సమీపంలో నిర్మిస్తున్న భారీ అంతస్తు భవనం నుంచి జారిపడి కొత్తూరుకు చెందిన యర్రం రెడ్డి చెన్నారెడ్డి(65) మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం పునుగోడుకు చెందిన యర్రంరెడ్డి చెన్నారెడ్డి గత కొంత కాలంగా కొత్తూరులోని అల్లుడి దగ్గర ఉంటున్నాడు. చెన్నారెడ్డి అల్లుడు ఇటీవల పట్టణంలోని వెన్నెల అపార్ట్ సమీపంలో నూతనంగా మూడు అంతస్తుల ఇంటి భవన నిర్మాణం చేపట్టాడు. నిర్మాణంలో ఉన్న అల్లుడి ఇంటి గోడలకు నీళ్లు పట్టేందుకు వెళ్లిన చెన్నారెడ్డి ప్రమాదవశాత్తు జారి మెట్ల కింద పడి తల పగిలి చనిపోయాడు. మృతుని తమ్ముడు యర్రంరెడ్డి అంకిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోషకాహార లోపంపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలెవరూ తీవ్ర పోషకాహార లోపంతో బాధపడకూడదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవనంలో ఐసీడీఎస్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, వయస్సుకు తగినట్టుగా ఎత్తు, బరువు ఉండేలా తగిన ఆహారం అందించాలన్నారు. చిన్నారుల ఎత్తు, బరువును లెక్కించడంలో అవసరమైతే అంగన్‌వాడీ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఉద్దేశ పూర్వకంగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యవేక్షణా లోపం ఉంటే సీడీపీవోలపైనా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారులు, గర్భిణులకు, బాలింతలకు, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం కచ్చితంగా అందేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.మాధురి, సీడీపీవోలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



నివాళులు అర్పిస్తున్న స్పెషల్ కలెక్టర్, బీసీ సంక్షేమ అధికారులు, నాయకులు

ఒంగోలు సెంట్రల్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్ విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వకర్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ టీడీపీ కన్వీనర్ పీ సాయిబాబ, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ కన్వీనర్ మందాబాబు, విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం అధ్యక్షుడు సీహెచ్ సురేష్, సిద్ధాంతి బ్రహ్మాచారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి పీ జగన్నాథరావు, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమాధికారి యం.అంజల, ఇతర బీసీ సంక్షేమ సంఘ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని ఘన నివాళులర్పించారు.

ఖేలో ఇండియా పోటీలకు కంభం విద్యార్థిని



మెమొంటో అందుకుంటున్న ప్రసన్నలేఖ

కంభం: స్థానిక ఎస్‌వీకేపీ పాలిటెక్నికల్ కళాశాలలో సివిల్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రామిరెడ్డి ప్రసన్నలేఖ ఖేలో ఇండియా జంప్ రోప్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 12 నుంచి 14 వరకు నాందేడ్‌లో నిర్వహించిన నేషనల్ జంప్ రోప్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటడంతో అక్టోబర్ లో నేపాల్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ సాయిబాబు రెడ్డి తెలిపారు. ప్రసన్న స్వగ్రామం కడప జిల్లా ముత్తుకూరు. రైతు కుటుంబానికి చెందిన ఆమె ఒలంపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు తెలిపింది.





కర్నూలు రోడ్డు బైపాస్ సర్కిల్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పనుల కోసం ఎదురు చూస్తున్న బేల్దారులు, కూలీలు



పేదలకు పనిష్మెంట్!

టీడీపీ కూటమి తీరు నిర్మాణ రంగాన్ని కుదిపేస్తోంది. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ప్రజలకే కాదు పేద కూలీలకూ ప్రభుత్వ పెద్దలు, టీడీపీ నాయకులు చుక్కలు చూపిస్తున్నారు. వర్షా కాలంలో నిర్మాణ రంగంలో ఇబ్బందులు తలెత్తకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఇసుక నిల్వ చేయగా.. అధికారం చేపట్టిన వెంటనే టీడీపీ నేతలు అడ్డగోలుగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒంగోలు, జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు స్టాక్ పాయింట్లలో మిగిలిన కాస్త ఇసుకను ప్రభుత్వ ఆధ్వర్యంలో విక్రయించారు. సుమారు రెండు నెలలుగా ఇసుక లేక స్టాక్ పాయింట్లు మూతవేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన నదుల్లో నీటి లభ్యత అధికంగా ఉండటంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ముందుగానే స్టాక్ పాయింట్లకు ఇసుక సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లాలో 90 శాతం మేర భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో పనుల్లేక కూలీలు, ఇతర అనుబంధ రంగాల కార్మికులు విలవిల్లాడుతున్నారు.

– సాక్షి, ఒంగోలు



ఒంగోలు రాజీవ్ నగర్‌లో ఇసుక లేక పనులు ఆగిపోయిన అపార్ట్‌మెంట్లు



ఒంగోలులోని లాయరుపేట ఎక్స్‌టెన్షన్‌లో పనులు నిలిచిన భవనం



ఒంగోలు మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్



సీతారామపురంలో కంకర, ఇటుకలు నిల్వ ఉండి ఇసుక లేక బేస్ లెవెల్‌లో నిలిచిన ఇంటి నిర్మాణ పనులు



ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఒంగోలు బండ్లమిట్ట సెంటర్‌లో ఖాళీగా ఉన్న ట్రాలీ ఆటోలు

విద్యార్థిని ఆత్మహత్యపై అనుమానాలెన్నో..



మృతురాలు భావన(ఫైల్)



రోదిస్తున్న భావన తల్లి ధనలక్ష్మి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలులోని హర్షిణి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థిని భావన ఆత్మహత్యపై ఎన్నో అనుమానాలు నెలకొన్నాయి. దీంతో బాలిక తల్లి, సోదరితో పాటు విద్యార్థిసంఘాల నేతలు సైతం విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తండ్రి లేకున్నా తన పిల్లలతో రెక్కల కష్టంతో చదివించానని తల్లి రోదించిన తీరు స్థానికులను సైతం కంటతడిపెట్టించింది.

ఆ చీర ఎక్కడిది..?

భావన ఉరేసుకున్న చీరపై అటు కళాశాల యాజమాన్యం, ఇటు బాలిక కుటుంబసభ్యులు చెరో మాట చెబుతున్నారు. సెలవులకు ఇంటికి వెళ్లిన భావన ఇంటి నుంచి వచ్చే సమయంలోనే చీర తెచ్చుకుందని కళాశాల యాజమాన్యం చెబుతుంది. ఇంటి నుంచి చీర తెచ్చుకోలేదని, అది ఎక్కడ నుంచి వచ్చిందో మాకు తెలియదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇందులో ఎవరి మాట నిజమో పోలీసులే చెప్పాలి. అయితే భావన ఇంటి నుంచి చీర తెచ్చుకొని ఉంటే కళాశాల సిబ్బంది ఎందుకు ప్రశ్నించలేదో, కళాశాలలోకి చీరను ఎందుకు అనుమతిచ్చారో తెలియాల్సి ఉంది. బాలల హక్కుల కమిషన్ చైర్మన్ బత్తుల పద్మావతి కూడా కాలేజీలోకి చీర ఎలా వచ్చిందో విచారణ చేయాలని ఆదేశించారు.

మొఖం చాటేసిన చైర్మన్

కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి కూడా టీడీపీ నాయకుడు, కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ పత్తా లేకుండా పోయారు. ఆయనతో పాటుగా కళాశాల హెచ్‌ఆర్ సురేష్, కేర్ టేకర్ చాముండేశ్వరి కూడా కనిపించలేదు. కళాశాల ప్రిన్సిపాల్‌కు బదులుగా డీన్ ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. ఒక్కసారిగా వీరంతా కనిపించకుండా పోవడంపై మృతురాలి సోదరి ఐశ్వర్య అనుమానం వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని కుటుంబ సభ్యులతో ఎందుకు మాట్లాడరని నిలదీశారు. పచ్చవ గ్రామానికి చెందిన మరో ఇద్దరు విద్యార్థినులు భావనతో కలిసి చదువుకుంటున్నారని, కనీసం వారితో కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారణకు బాలల హక్కుల కమిషన్ ఆదేశం

భావన ఆత్మహత్య సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఘటనా స్థలాన్ని సందర్శించి బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. కళాశాలలోని విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాల చైర్మన్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల నిర్వాహణా లోపాలపై ప్రశ్నించారు. ఐదంతస్తుల భవన నిర్మాణానికి ఎవరు అనుమతులు ఇచ్చారని, జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నప్పుడు బాలల హక్కుల పరిరక్షణకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. ప్రతి అంతస్తులోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాల్సి ఉండగా కనీసం ఒక్క అంతస్తులోనూ సీసీ కెమెరాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని, కనీసం భోజనాల దగ్గరైనా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. బాలిక ఆత్మహత్య చేసుకున్నప్పుడు కళాశాల యూనిఫాం ధరించడం, ఉరి వేసుకున్న షెడ్డు పై కప్పు పెద్దగా ఎత్తులో లేకపోవడం, ఉరి వేసుకునేందుకు చీర ఎక్కడనుంచి వచ్చిందో తెలియాల్సి ఉందని సందేహాలను వ్యక్తం చేశారు. మూడు రోజుల్లోగా పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులకు ఆమె ఆదేశించారు. ఆమెతో పాటుగా ఆర్ఐఓ సైమన్, జిల్లా బాలల హక్కుల కమిటీ సభ్యురాలు నీలిమ, డిస్టిక్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్, సామాజిక కార్యకర్త వీరాంజనేయులు ఉన్నారు. భావన ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలని, కళాశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

● రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సూచనలిస్తున్న పద్మావతి

సింగరాయకొండ: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది సమ సమాజ స్థాపనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజన పథకం స్టాక్ రిజిష్టర్లు పరిశీలించి పాఠశాల అవరణను పరిశీలించారు. తరువాత ఆమె విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ పాఠశాలలో ప్రధానంగా తరుచూ విద్యుత్ సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలో కోతుల బెడద అధికంగా ఉందని, తరుచూ గాయపరుస్తున్నాయని తెలిపారు. డైనింగ్ హాలు సరిపోవడం లేదని, మరొకటి ఏర్పాటు చేయాలని కోరారు. తరువాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులు ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. నేటి సమాజంలో విద్యార్థులు గంజాయి వంటి చెడు వ్యసనాల బారిన పడుతున్నారని, వారిని మంచి మార్గంలో తీసుకుని వచ్చి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. తహశీల్దార్ టి.రవి, ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు, సీడీపీఓ మల్లీశ్వరి, ఆర్ఐ ప్రవీణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇలా పట్టుకుని.. అలా వదిలేశారు!

● రేషన్ బియ్యాన్ని వదిలేయడంపై అనుమానాలు
● కొర్రలు, జొన్నలు కావడంతో సీజ్ చేయలేదన్న డీటీ



ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

కంభం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేయకుండా వదిలేసిన విషయం కంభంలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్ డీటీ ప్రసాద్ సోమవారం రాత్రి 10 గంటల సమయంలో అడ్డుకున్నారు. అందులో 44 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రేషన్ బియ్యాన్ని గోడౌన్‌కు తరలించి, వాహనాన్ని పోలీసులకు అప్పగించకుండా కేవలం ఫొటోలు తీసుకుని వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై గోడౌన్ డీటీని వివరణ కోరగా.. ఆటోలో ఉన్నది కొర్రలు, జొన్నలు కావడంతో వదిలేశానని చెప్పడం గమనార్హం.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మార్కాపురం: సాగర్ నీరు గత కొద్దిరోజులుగా సక్రమంగా సరఫరా కావడం లేదంటూ మార్కాపురం మండలంలోని యాచవరంలో మహిళలు మంగళవారం రోడ్డెక్కారు. తాగునీటికి నానాఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి నీరు సరఫరా చేయాలని గ్రామస్తులు జాజా రమణయ్య, సవ్వాని సుబ్బమ్మ, జి.తిరుపతి, ఎస్.తిరుపతయ్య, ఎస్ నారాయణలు విజ్ఞప్తి చేశారు.

జార్జి ఆశయాలు కొనసాగిస్తాం

● మాజీ మంత్రి సురేష్



జార్జి కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ సురేష్, విజయలక్ష్మి

మార్కాపురం: జార్జి ఆశయాలు కొనసాగిస్తానని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ సామ్యేల్ జార్జి 18వ వర్ధంతి సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జార్జి స్మృతి–2024 కార్యక్రమంలో ఆయన తన సతీమణి ఐటీ కమిషనర్ విజయలక్ష్మితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి విద్యను చేరువ చేసిన దార్శనికుడు డాక్టర్ సామ్యేల్ జార్జి అని కొనియాడారు. జార్జి ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. కళాశాలను డీమ్డ్ వర్శిటీ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నామన్నారు. అనంతరం కళాశాలలో సామ్యేల్ జార్జి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాళ్లు రాజబాబు, రాజా జయరావు, డీన్ డాక్టర్ మస్తానయ్య, పాస్టర్స్ ఆంద్రూస్, జాన్ అరోమ్, యేసుదాసు, ఆర్‌సీఎం సిస్టర్స్, దైవజనులు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్ సందర్భంగా సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్

ఒంగోలు టౌన్: ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మెడికల్ సీట్ల భర్తీకి గాను మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఒంగోలు మెడికల్ కాలేజీలో మొత్తం 120 సీట్లు ఉండగా అందులో 18 సీట్లు ఆలిండియా కోటాకు కేటాయించారు. మిగతా 102 సీట్లలో 93 మంది అడ్మిషన్లు తీసుకున్నారని, వారిలో 37 మంది కాలేజీలో చేరారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఆలిండియా కోటా సీట్లలో కూడా 8 మంది చేరినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం వరకు కాలేజీలో చేరేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఇది ఇలా ఉండగా మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభం కావడంతో కాలేజీ ఆవరణ కోలాహలంగా మారింది. విద్యార్థులు, వారి తల్లిదండులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాంతో విద్యార్థుల తలిదండ్రులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల మెడికల్ బోర్డు, ఇతర విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు.

శుభ్రతతో ఆరోగ్యకర సమాజం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు వేస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం ఆవిష్కృతమవుతుందని, ఈ దిశగా విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులకు ఆమె ఆల్బెండజోల్ మాత్రలు స్వయంగా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు 5,96,751 మంది ఉన్నారని చెప్పారు. వీరికి 2849 మంది అంగన్‌వాడీలు, 1694 మంది ఆశాలు, 894 ఏఎన్ఎంల ద్వారా 2718 పాఠశాలలు, 233 కళాశాలలు, 95 ఇతర వృత్తి విద్య సంస్థల్లో ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రుల్లోనూ ఈ మాత్రలను అందుబాటులో ఉంచామన్నారు. మంగళవారం మాత్రలు వేసుకోలేని వారు ఉంటే ఈనెల 25వ తేదీ మాత్రలు వేసేలా మాప్–అప్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. నులి పురుగుల బారిన పడిన వారిలో ఆకలి మందగించి రక్తహీనత వస్తుందని, ఫలితంగా నీరసంగా ఉండి చదువు పైనా, ఇతర ఏ పని పైనా ఏకాగ్రత పెట్టలేరని తెలిపారు. అందుకే ఆల్బెండజోల్ మాత్రలు వేయడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పైనా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సురేష్ కుమార్, ఆర్.బి.ఎస్.కె. నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరధి, డి.ఐ.ఓ. డాక్టర్ పద్మజ, డి.పి.ఎం.వో.వాణిశ్రీ,, ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మనీష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం!

● హైరానాపడిన తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం

మార్కాపురం: ఓ యువకుడు వ్యక్తిగత కక్షతో ఒక ప్రైవేట్ స్కూల్ గణిత టీచర్‌పై ఇన్‌స్టాగామ్‌లో మార్కాపురం ముచ్చట్లు పేజీలో పెట్టిన ఒక పోస్టింగ్ అటు తల్లిదండ్రుల్లో ఇటు పాఠశాల యాజమాన్యంలో టెన్షన్ పుట్టించింది. తమ పాఠశాల పూర్వ విద్యార్థి వ్యక్తిగత ద్వేషంతో ఈ పోస్టు పెట్టినట్టు విచారణలో తేలిందని హెచ్ఎం లక్ష్మీరెడ్డి వెల్లడించారు. తమ పాఠశాలలో ఎలాంటి సంఘటనలు జరగలేదని స్పష్టం చేశారు. కాగా పూర్వ విద్యార్థి నిర్వాకం బయటపడటంతో సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టును డిలీట్ చేశాడు